


# గంగరాజు

ద్వివేదుల విశాలాక్షి

“తాజావార్త ఇప్పుడే అందినవార్త....
వేడివేడి మసాలా వడ లాటి పసందైన వార్త.... తెలుసుకోవాలంటే ‘‘ఈవెనింగ్ న్యూస్’’ కొనండి....పత్రిక వెల పది పైసలు మాత్రమే—’’ పేపరు కుర్రాడు హుషారుగా కేకలుపెడుతూ తన సేల్సుమెన్ చాతుర్యాన్ని అమ్మకంలో ప్రదర్శిస్తూ దారంట పోతున్నాడు.

అప్పుడు వాడి ముఖంలో కనిపిస్తున్న ఉత్సాహం చూస్తే, ఆ రోజు తన చేతిలో ఉన్న పేపర్లన్నీ తప్పక అమ్ముడు పోతాయనీ, కమీషన్‌గా రోజూకన్న నాలుగు డబ్బులు ఎక్కువగా చేతిలో పడ్తాయనీ ఆ సొమ్ము పెట్టుకుని ఆరోజే విడుదల కానున్న తన అభిమాన నటుడు నటిస్తున్న సినీమా మొదటి ఆటకే కుర్చీ టిక్కెట్టు కొనుక్కోవచ్చుననీ పుట్టెడు నమ్మకంతో ఉన్నట్లు ఉంది.

వీధి వరండాలో వాలుకుర్చీలో కూర్చుని పొరుగింటినుంచి ఎరువుతెచ్చుకొన్న పొద్దుటి వార్తా పత్రికచూస్తున్న వెంకటపతికి పేపరు కుర్రాడు అంత ఉత్సాహంగా అమ్ముతున్న ఆ వేడివేడి మసాలా వడలాంటి వార్తఏమిటో రుచి చూడాలనిపించింది. వెంటనే పక్క జేబులోంచి పది పైసల నాణెం తీసి, పక్క అరుగుమీద మోకాళ్ళ బడి ఫిల్ము ఫేర్‌లో బొమ్మలు చూస్తున్న చిన్న కొడుకుని కేకేసి, ‘‘ఒరేయ్ అబ్బిగా....ఈ పది పైసలు పట్టుకెళ్ళి ఒక పేపరు తీసుకురా’’ అంటూ ఆజ్ఞ జారీ చేసేడు.

ఆ అబ్బిగాడు తండ్రి చేతిలోంచి పది పైసల్ని పదిలంగా అందుకొని, పిడికిలి బంధించి, హనుమంతుడు సీతాన్వేషణార్థం సముద్రాన్ని దాటినట్లు, ఒక్కసారి కుప్పించి చెంగున అరుగుమీంచి సైడుకాలువను లంఘించి, ఆ వీధి చివరికి పోయిన పేపరు కుర్రాడిని పరుగుతో పోయి పట్టుకొన్నాడు.

పది పైసలు ఖర్చుచేసి, కొన్న ఆ పత్రికలో పేపరు కుర్రాడు అంత ఉత్సాహంగా అరుస్తున్న ఆ వార్త ఏదో వెంటనే వెంకటపతి కంట పడలేదు కానీ, ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఇంకో వార్త అతడి దృష్టిని ఆకట్టుకొంది.

అది ప్రముఖ నక్సలైటు నాయకుడు సంగివలస గంగరాజు పట్టుబడ్డాడు—అన్న వార్త.

ఆ వార్త చూసిందే తడవుగా చేతిలో పేపరు అలా పట్టుకొని, ‘‘ఇదిగో....ఏమేవ్ గంగరాజు దొరికిపోయాట్ట’’ అంటూ, ఇంటావిడ పురాణం వినడానికి కోవెలకి వెళ్లింది అన్న మాట మరచిపోయి, ఇంట్లోకి చూస్తూ ఒక గావు కేక పెట్టేడు.

వెంకటపతి అంత ఆత్రంగా ఆ వార్తని భార్యకి అందచెయ్యాలనుకోడానికి ఒక కారణం లేకపోలేదు. అంతకు నాలుగు నెలలకి పూర్వం వెంకటపతి భార్య సత్యనారాయణమ్మకి స్వయానా వేలువిడిచిన పిన తండ్రి అల్లుడి బావమరది కుటుంబాన్ని గంగరాజు ముఠావాళ్లు రాత్రికి రాత్రే పూర్తిగా తుడిచిపెట్టేసేరు. అయితే అది గంగరాజు ముఠావాళ్లు చేసినపని కాదనీ, ఎవరో ఆ ఊళ్ళో కిట్టనివాళ్లు అతడిమీద కక్షతో ఆ అత్యాచారంచేసి, దాన్ని అనువుగా దొరికేరని నక్సలైట్ల మీదికి నెట్టివేసేరని కొందరు అనకపోలేదు. ఏమైనా ఆనాటినుంచి వెంకటపతికి, సత్యనారాయణమ్మకి గంగరాజుమీద పీకలమొయ్యా కోపం పేరుకుపోయింది. ఆ వెధవ పట్టుబడితే ఆంజనేయస్వామికి పది కొబ్బరికాయలు కొట్టి, ఆరోజు పండుగ చేస్తాను—అనేది నారాయణమ్మ. వెంకటపతి సంగతి సరేసరి. ‘సంగివలస గంగరాజు ఫండ్’ అని ఒక హుండీ ఏర్పరచి, ఇంటింటికి తిరిగి సొమ్ము కూడబెట్టేడు. ఎవడైతే గంగరాజుని పట్టుకొంటాడో వాడికి సన్మానంచేసి, ఆ హుండీ బహూకరించాలని అతడి అభిప్రాయం.

నిజానికి నక్సలైటు గంగరాజు పట్ల అంత కోపం పెంచుకోడానికి వెంకటపతికి తగినంత కారణంలేదు. పోనీ భయమా అంటే వాళ్ల దోచుకుపోడానికి అతడిదగ్గర వేలకివేలు సొమ్ములేదు. వెండి బంగారాలు అసలే లేవు. కాదంటే పెళ్ళీడుకొచ్చిన ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇక్కడా అక్కడా వింటున్న కబుర్లతో ఏ కానివేళో

ఆ ముఠా వచ్చి ఇంటిమీద పడి ఏం అత్యాచారాలు చేస్తారో అన్న భయం మాత్రం దండిగా ఉంది ఆ దంపతులకు.

మూడునెలల కిందట గంగరాజుని పట్టుకోడానికి ఒక స్పెషల్ పోలీసు ఆఫీసర్ని నియమించారనీ, యింక వారి ఆటలు అట్టేకాలం సాగవనీ, ఒకవార్త పేపర్లో వచ్చింది. అది చూసిననాడు ఆరునెలలుగా రాత్రి నిద్రా, పగలు తిండీ ఒంటబట్టని డబ్బు గలవాళ్ళతో పాటు వెంకటపతీ, నారాయణమ్మకూడా బరువు దింపుకొన్నట్లు సంతోషించేరు. కాని, ఆ స్పెషల్ ఆఫీసరు మెరికల్లాటి పోలీసు బృందంతో, ఆరితేరిన సి. ఐ. డీ. లతో ఆ కొండలంట, అడవులంట కాళ్ళు అరిగేలా తిరిగి తిరిగి, యెంత గాలించినా గంగరాజు ముఠా ఆనుపానులు పట్టలేకపోయేరు.

అదిమొదలుగా ఇదిగో గంగరాజు పట్టుబడిపోయేడు, రాజమండ్రీ జైలులో బంధించేరు అనే వార్తలు, లేదు యింకా పట్టుపడలేదు కాని, వాళ్ళ ఉనికి తెలుసుకొన్నారు ఏదో మంచిరోజు చూసి అందర్నీ ఒక్కసారి వలేసి పట్టుకొంటారు అని, మరికొన్ని వార్తలు. అవునూ, కాదూ అని ప్రజల్ని తికమక పెట్టసాగేయి.

ఆరునెలలుగా చుట్టుపక్కల చిన్నా పెద్దా ఊళ్ళలో మనుషులకి తిండీ, నిద్రా వంట పట్టకుండా హడలకొడ్తున్న గంగరాజు ఆ నాటికి పట్టుబడ్డాడు అన్నవార్త వెంకటపతి మనసులో వెయ్యిదీపాలు వెలిగించింది. నాయకుడు పట్టుబడ్డాక యింక మిగిలినవాళ్ళు యెంతకాలం యెదిరించి నిలుస్తారు? ఈ రోజుతో యీ ప్రాంతాలకి నక్సలైట్ల బాధ తప్పినట్లే అనుకొన్నాడు.

ఇంతమందిని హడలకొడుతూ, పోలీసు వారి కళ్ళలో ఇంతకాలంగా కారంజల్లి తప్పించుకు తిరుగుతున్న ఈ సంగివలస గంగరాజు యెవడు? ఎలా ఉంటాడు?—అన్న కుతూహలం అతడి మనసులో ప్రవేశించింది. చత్వారం కళ్ళజోడు ఒకసారి పైకి తీసి, కట్టుకొన్న పంచె కొనతో దానివి పది లంగా తుడిచి, కుడిపక్క ఫ్రేముకి వేలాడుతున్న తాడుని గట్టిగా చెవిచుట్టూ తిప్పి కట్టుకొని, వసారాలోంచి కొంచెం ముందుకి జరిగి, పడమటికి తిరిగిన పొద్దుకి ఎదురుగా పేపరు పెట్టి, ఆ వార్తకి పైగా ఉన్న ఫొటోని పరిశీలనగా చూడసాగేడు.

చేతులకి బేడీలతో ఇద్దరు పోలీసులకి మధ్యగా నిలచివున్నాడు ఫొటోలో గంగరాజు.

క్రౌర్యం ఉట్టిపడే కళ్లు, కండలు తిరిగిన జబ్బలు, ఒడ్డూ, పొడుగు, భారీ అయిన ఛాతీ, దుబ్బుమీసాలు, పొడుగైన క్రాపు, గళ్ల లుంగీ, కట్ బనియను, మెడలో మఫ్లర్—తెలుగు సినిమాల్లో కనిపించే పల్లెటూరి విలన్‌లాగో, లేక పట్నవాసపు విలన్ సహచర వర్గంలోని ముఖ్య నాయకుడులాగో ఉంటాడనుకొనేవాడు వెంకటపతి, ఆ ఫొటో చూడకముందు, గంగరాజు చర్యలుమాత్రమే వింటుండే సమయాల్లో.

కాని, ఎదురుగా పేపర్లోవున్న ఫొటోలో గంగరాజు నిండా ముప్పయి నిండని యువకుడు. ఆ వయసులో వుండే కుర్రాళ్లు అందరు వేసుకొనేలాగే పాంటు, బుష్ షర్టు వేసుకొన్నాడు. కాళ్ళకు చెప్పులు వున్నాయి. పొట్టిగా కత్తిరించిన జుట్టు ఆ ముఖానికి బాగా అమరివుంది. నిర్మలంగా వున్న ముఖంతో, ధైర్యంగా, దర్పంగా పోలీసుల మధ్య అలా నిలబడివున్న ఆ కుర్రాడు సంగివలస గంగరాజు అంటే నమ్మలేకపోయేడు వెంకటపతి.

నిండు యవ్వనంలో, చురుకైన కళ్ళతో వున్న ఈ కుర్రాడు గంగరాజు? ఆరు నెలలుగా ధనవంతుల గుండెల్లో సింహస్వప్నంగా నిలచి, వ్యాపారుల ప్రాణాలకి కాలయముడుగా వెలసి, పోలీసుబృందాల్ని మూడు చెరువుల నీళ్లు తాగించిన సంగివలస గంగరాజు అంటే ఇతడా?


నమ్మలేకపోయేడు వెంకటపతి. కింద ఇచ్చిన వార్తకి, పైనున్నఫొటోకి సంబంధం లేదేమో? ఇది యింకో సందర్భంగా అరష్టయిన కుర్రాడి ఫొటో ఏమో అనుకొన్నాడు. కాని అనుమానం అట్టేసేపు అతడి మనసులో నిలవలేదు. ఆ ఫొటోకింద అతడు కురుపాం అడవుల్లో పట్టుబడ్డ సంగివలస గంగరాజు అని స్పష్టంగా రాసివుంది.

ఆ ఫొటోలో గంగరాజుని చూస్తుంటే టాటాలో ఉద్యోగం చేసుకొంటూ, పిల్లాపాపాతో ముచ్చటగా బ్రతుకుతున్న తన పెద్దకొడుకు గోపాలం గుర్తుకివచ్చేడు వెంకటపతికి.

ఈ ఇద్దరి బ్రతుకులకి ఎంత వ్యత్యాసం వుంది? వాడు హాయిగా కడుపులో చల్ల కదలకుండా ఉంటే, వీడు ఈ వయసులో జీవితంలోని సుఖసంతోషాలు అందుకోవలసిన తరుణంలో ఇలా కొండలవెంట, గుట్టలవెంట తిరుగుతూ, తిన్నచోట తినకుండా, ఉన్నచోట ఉండకుండా అనుక్షణం పోలీసుల్ని తప్పించుకు తిరుగుతూ, యిలా యెందుకు తయారయేడు? ఈ జీవితాన్ని ఇతడు ఎంచుకోడంలో ఏ సుఖసంతోషాలు అందుకోవాలని? ఏ అభివృద్ధి సాధించాలని? ఏ పరిస్థితులు ఇతన్ని యిటువంటి విద్రోహ చర్యలకి పురికొల్పేయి. ఇటువంటి కొడుకుని చూసుకుని కన్న తలిదండ్రులు యెలా సహిస్తున్నారు? ఎలా భరిస్తున్నారు? ఇది ఈ నవతరం ఆలోచనల్లో వస్తున్న దోషమా? లేక పెద్దల పెంపక సరళిలో వున్న లోపమా?

వెంకటపతి అలా ఆలోచిస్తూ, పరిశీలనగా ఫొటోవైపు చూస్తుంటే ఆ కుర్రాడిని తానంతకు పూర్వం యెక్కడో చూసినట్లు, కేవలం చూడ్డమే కాకుండా పరిచయంకూడా వున్నట్లు అనిపించింది.

ఈ సంగివలస గంగరాజుని తను ఎక్కడ చూసివుంటాడు? పోనీ, పేపర్లలో తరుచు ఫొటోలు చూడ్డంవల్ల అటువంటి భ్రాంతి ఏర్పడిందేమో అనుకోడానికికూడా లేదు. ఇంతవరకు ఈ గంగరాజు ఎలా ఉంటాడో... ఏ వయసువాడో సరిగా పోలీసువారికే తెలియదు. పది, పదిహేనుమంది పిల్లల మధ్యగా, ఆతడు పదేళ్లవయసులో వున్నప్పుడు




తీయించుకొన్న ఫొటోని పట్టుకొని, ఆ సాయంతో అతడిని పట్టుకోడానికి తిప్పలు పడ్డారుట వాళ్లు. ఇంక అటువంటప్పుడు పేపరు మూలంగా పరిచయమైన ముఖం కాదు ఇది. మరి ఎప్పుడు, ఎలా అయివుంటుంది ఈ ప్రముఖ నక్సలైటు నాయకుడు సంగివలస గంగరాజుతో పరిచయం?

వెంకటపతి చెక్కిట చెయ్యి చేర్చి అలా ఆలోచిస్తుంటే పక్కింటివారి అబ్బాయి పేపరుకోసం వచ్చేడు. అతన్ని ఆ పోజులో చూసి, సినీమాల పిచ్చి కాస్త ఎక్కువగా వున్న ఆ కుర్రాడు, "మేష్టారూ! కంటికింద ఆ మచ్చ లేకుండావుంటే మీరు అచ్చం 'నాదీ మనిషిజన్మే' లో గుమ్మడిలా వుంటారండి" అన్నాడు.

"నాదీ మనిషి జన్మే" అనే ఆ సినిమా వెంకటపతి చూడలేదు. దానిలో గుమ్మడి ఏ వేషం వేసేడో, అతడి పాత్రకి తనకి ఉన్న పోలిక ఏమిటో ఇవేమీ అతడి మనసులోకి రాలేదు.

ఆ కుర్రాడు కంటికింద మచ్చ విషయం ఎత్తగానే అంతకిపూర్వం అరగంటగా ఎంత తల పగులకొట్టుకొన్నా విడని చిక్కుముడి యిట్టే విడిపోయినట్లయింది. కళ్ళముందున్న తెర విడిపోయి, గంగరాజును తను ఎప్పుడు యెలా కలుసుకొన్నాడో—ఆనాటి కథంతా రంగంమీదికి వచ్చింది.

అవి వెంకటపతి పాలెంలో టీచర్‌గా పనిచేస్తున్న రోజులు. అయిదో క్లాసుకి లెక్కలు చెప్తూ ఉండేవాడు. అతడి క్లాసులో ఎప్పుడూ చివరి బెంచీలో కూర్చునేవాడు ఒక పిల్లడు. ముడుకులు దిగని లాగు, బొత్తాములు లేని లాల్చీ, చెదరిన జుట్టు, మట్టి కొట్టుకొన్న కాళ్లు; పొట్టిగా, పీలగా ఉండేవాడు.

ఆ కుర్రాడిపేరు ఏమిటో చాలా రోజుల వరకు వెంకటపతికి తెలిసి రాలేదు. ఏరోజూ ఎటెండెన్సు వేసే వేళకి క్లాసులో ఉండేవాడుకాడు. మధ్యలో ఎవరి దృష్టిని ఆకర్షించకుండా ఎలాగో వచ్చి తన సీటులో కూర్చునేవాడు. తిరిగి బడి విడుపుగంట కొట్టే సరికి క్లాసులో లేకుండా మాయ మయేవాడు.

మిగిలిన పిల్లల్ని అడిగితే 'వాడు ఇంటి దగ్గర చాలా పని చెయ్యాలండీ లేకుంటే వాళ్లత్త తంతుంది—అందుకే వేళకి సరిగా రాడు—'అనేవారు. ఆ కుర్రాడిపేరు గంగులు

రోజు వెనుక రోజుగా గంగుల్ని చూస్తూంటే మిగిలిన పిల్లలతో కలవని ప్రత్యేకత ఏదో అతడిలో ఉన్నట్లు అనిపించేది. రూపురేఖల్లోకాని, చదువులో కాని ఏపాటి ప్రాముఖ్యత లేని ఆ కుర్రాడు ఇంకేదో శక్తితో పిల్లలందర్నీ తనచుట్టూ తిప్పుకొంటున్నట్లు ఉండేది. పిల్లలెవరికీ గంగులుపట్ల ఆపేక్ష, స్నేహభావం ఉండేది కాదు, అయినా అతడిమాటని తూచా తప్పకుండా పాటించేవారు. పిల్లలే కాక కొంత మంది మేష్టర్లు కూడా గంగులంటే భయపడ్డం వెంకటపతికి ఆశ్చర్యంగా ఉండేది.

అందరూ ఇంతగా భయపడ్డానికి, తప్పుకు తిరగడానికి గంగుల్లో ఉన్న దోషం ఏమిటో అని ఎంత పరిశీలనగా చూసినా అతడికి పెద్దగా ఏం కనిపించలేదు. గంగులు చూసిందికి ఏడేళ్ల పిల్లవాడిలా ఉండేవాడు. స్కూలురిజిష్టర్‌లో ఆ పిల్లడివయస్సు ఏడేళ్లని ఉంది. కాని మాట్లాడు తుంటే పదిహేను, పదహారేళ్ళ అబ్బాయి ఎవరో ఆ పిల్లాడి వెనుకగా నిలిచి మాట్లాడుతున్నట్లు ఉండేది. ఎదుటఉన్న వ్యక్తికి, అతడి నోటి వెంట వచ్చే మాటకి పొంతనం కుదిరేదికాదు.

చాలా రోజులదాకా గంగులు కరణంగారి అబ్బాయి అనుకొనేవాడు వెంకటపతి. ఆ అర్ధ సంవత్సరం పరీక్షల్లో గంగులుకి మంచి మార్కులు రాలేదు. మార్కులలిస్టు వేసి అందరి పిల్లలతోపాటు వాడి చేతిలో పెట్టి, 'నీ చదువేం బాగాలేదు. మీ నాన్నగారికి చూపించు' అన్నాడు. "వద్దు లెండి మేష్టారు! నాన్నబాధపడ్తాడు" అన్నాడు వాడు నిర్లిప్తంగా. మంచిమార్కులు రాలేదని వాడు అలా అంటున్నాడనుకొని, "నువ్వు చూపించకపోతే....ఇలాతే నేను చూపిస్తాను," అన్నారు. వెంకటపతి, "వద్దు లెండి మాష్టారు, మీరు మంచివారు. మీరు చచ్చిపోడం నాకిష్టంలే" అన్నాడు గంగులు.

ఆమాట అంటూనే వెనుతిరిగి వెళ్లిపోయేడు. ఆ వెనుక తెలిసింది, గంగులు తల్లీ తండ్రీ లేరని, వాడు మూడేళ్ల వయసులో ఉండగా కలరావచ్చి ఇద్దరూ ఒక్కరోజునే చచ్చిపోయేరని. కరణం కనకయ్య భార్య మహంకాళి గంగులుకి మేనత్త, సార్థకనామధేయురాలైన ఆ అత్త తల్లీ తండ్రీ లేని మేనల్లుని పెంచుతున్నది.

అత్త సంగతి అలా ఉంటే జిత్తులమారి కనకయ్య సంగతి ఇంక చెప్పనే అక్కరలేదు. గంగులుకి స్వగ్రామం అయిన సంగివలసలో ఇల్లుపొలం వగైరాఆస్తిపాస్తిఉండేది. వాడు పెద్దవాడు అయి అవి తనవి అని అడిగేలోపల సాధ్యమైనంత వరకు కైంకర్యం చేయాలని అతడి అభిలాష. గంగులు ఏనాటికీ తన వ్యాపారవ్యవహారాలు తాను చూసు

కొనే విధంగా తయారు కాకూడదని ఇంకా ఆలోచన.

కనకయ్య ఆశయం ఒక విధంగా నెరవేరింది. గంగులుకి చదువు పట్ల, తన బ్రతుకు పట్ల ఉత్సాహం, కోరిక కలగలేదు. కాని ఇంకో విధంగా చూస్తే గంగులు ఆ వయసు పిల్లలకన్నా ప్రపంచ జ్ఞానం, గ్రహింపు శక్తి విషయంలో ప్రత్యేకత గలిగి ఉండేవాడు. సాధారణంగా ఆ వయసుపిల్లల మనసులోకి రాని ఎన్నో సంశయాలు వాడి బుర్రలోకి వస్తుండేవి. తన మనసులోకి వచ్చిన అనుమానాల్ని ఎప్పుడైనా వెంకటపతి ముందు పెట్టుంగేవాడు. అతడు చెప్పిన సమాధానాలు ఆపిల్లడికి తృప్తి కలిగించేవో, లేవో కాని మారు మాటలేకుండా వెళ్లి పోయేవాడు.

అంతా అనుకొన్నట్లే ఆ ఏడు గంగులు పరీక్ష పోయింది. ఆ మాట విన్నా వాడు ఏమాత్రం చలించలేదు. "ఫరవాలేదు మాష్టారు! మామయ్య కోప్పడడు లెండి. పరీక్షపోతే అతడికే మంచిది కాని....మళ్ళా కొత్త పుస్తకాలు కొనక్కర్లేదు" అన్నాడు నవ్వుతూ.

గంగులుకన్నా శుద్ధ మొద్దావతారాలు ఎందరో పాసు అయ్యేరు. ఆ ఏడే మొదటి సారిగా ఆ స్కూల్లో చేరిన వెంకటపతికి పరీక్షా ఫలితాల్లో ఏదో వెలితి వున్నట్లు అనిపించింది. ఆ తరువాత హెడ్‌మాష్టరు తన గదిలోకి పిలిచి ఇరవై రూపాయలు చేతిలో పెట్టేసరికి దాని వెనుక వున్న కథేదో తేలిపోయింది.

ఈ ఏడు మన రాష్ట్రంలో విద్యాశాఖ వారు చేసిన ఏర్పాటులాంటిదే (కొంచెం యించుమించుగా) ఆ స్కూల్లో హెడ్ మాష్టరు ప్రవేశ పెట్టేడు. ఈనాడు పిల్లల చదువు సంధ్యలతో సంబంధం లేకుండా యిన్ని రోజులు క్లాసుకి హాజరు అయితే చాలు పాసు అంటున్నారు. అప్పుడు—ఏ పిల్లడైతే అయిదు రూపాయలు తెచ్చి అయ్యవారి చేతిలో పెట్తాడో వాడు పరీక్షలలో,




మార్కులు సంబంధం లేకుండా పై తరగతిలో స్థానం సంపాదించుకొనేవాడు.

గంగులు కోసం అయిదు రూపాయలు ఖర్చుచెయ్యవలసిన అవసరం కనకయ్యకి కనిపించలేదు. "ఈ యేడు కూడా పోయిందంటే యింక నిన్ను చదివించను" అని మాత్రం హెచ్చరించేడు.

ఆ ఏడు అయిదులో ఉండిపోయిన గంగులుకి, నాలుగు పాసై వచ్చిన సుబ్బులుకి స్నేహం యేర్పడింది.

సుబ్బులు సత్యాగ్రహోద్యమంలో పాల్గొని చాలాసార్లు జైలుకి వెళ్ళి వచ్చిన ప్రముఖ కాంగ్రెసు వాది అప్పన్న పంతులుగారి మనుమడు. తండ్రిలేని ఈ పిల్లడిని సద్గుణ సంపన్నుడుగా, నీతికి, నిజాయితీకి ప్రతినిధిగా పెంచాలని అతడి ఆశయం. సుబ్బులు తెలివి తేటల్లో, రూపురేఖల్లో చూడముచ్చటగా ఉండేవాడు. కలవారి పిల్లవాడు కావడంవల్ల యెప్పుడూ నీటుగా బట్టలు వేసుకొని వచ్చేవాడు.

అటువంటి పిల్లడితో గంగులు స్నేహం అడవిలో ఉసిరి, సముద్రపు ఉప్పు కలసి ఊరగాయగా తయారైనట్లు ఉండేది నిజానికి ఆ గ్రామంలో అంతమంది పిల్లల్లో గంగులుని స్నేహభావంతో చూసి, దగ్గరికి వచ్చిన వాడు సుబ్బులు ఒక్కడే. మిగిలిన పిల్లలు గంగులు యెదుట నీ జట్టు అనేవారు, వాడు అటు ముఖం తిప్పగానే తిట్టిపోసేవారు.

నిర్మలమైన ఆ స్నేహవాహినికి అడ్డకట్టగా నిలచేయి ఆ ఏటి పరీక్షా ఫలితాలు. స్వతస్సిద్ధంగా తెలివైనవాడు, అప్పన్న పంతులుగారి పెంపకంలో పెరిగినవాడు అయిన సుబ్బులు మంచి మార్కులతో పాసయేడు. అలవాటుగా గంగులు పరీక్ష తప్పేడు.

ఆ స్కూల్లో అయిదోక్లాసు వరకే చదువు వుంది. ఆపై చదవాలనుకునే వాళ్లు పక్క ఊరికి పోవాలి. గంగులు పరీక్షపోయిందని వినగానే సుబ్బులు క్లాసులోనే ఏడ్చేసేడు. "ఏడవకురా సెలవలకి వస్తుంటావు కదా" అని ఓదార్చేడు గంగులు.


మరునాడు ఉదయం పరీక్ష పాసైనవారి లిష్టులో గంగులు పేరు వుండటం చూసి ఆశ్చర్యపోయేడు వెంకటపతి.

"పోయిందను కున్నానే .... నీ పరీక్ష పాసయిందట్రా గంగులూ" అంటూ పలకరించేరు.

"పోయినవాళ్ళ పరీక్షలు ఎలా పాసు అవుతాయో మీకు తెలీదేంటి మాష్టారు!" అన్నాడు గంగులు అదోలా నవ్వుతూ

పోయిన వాళ్ళ పరీక్షలు ఎలా పాసవుతాయో వెంకటపతికి తెలుసు. కాని గంగులు కోసం యెవరు సొమ్ము ఇచ్చేరో తెలియలేదు.

మరునాటినుంచీ వేసవి సెలవులు ప్రారంభం. ఉదయమే ప్రయాణం పెట్టుకున్నాడు వెంకటపతి. ఊరు విడిచి వెళ్ళే



ముందు కష్టానికి, సుఖానికి ఆదుకొనేమనిషి, అప్పన్న పంతులుగారితో చెప్పిరావాలని బయలుదేరాడు. దారిలో సూర్య నారాయణ యెదురుపడి, "పదండి నేనూ అటే వెళ్తున్నాను" అంటూ వెంటవచ్చేడు.

వారు వెళ్ళేసరికి అప్పన్న పంతులు ఇంట్లో లేడు. కోడలు అలివేణి తలుపు తీసింది.

"సుబ్బులు ఇంట్లోలేడా?" ఏదో ఒకటి అడగాలన్నట్లు అడిగాడు వెంకటపతి.

"ఉన్నాడు....ఉదయంనుంచి జ్వరం" బాధపడుతూ చెప్పింది ఆవిడ.

"అయ్యో అదేమిటి? విన్న బంతిలా వున్నాడు?"

"నా తలరాత బాబూ! మామగారి జేబులో అయిదు రూపాయలు పోయేయట. అవి వీడే తీసేడని ఆయన ఊరికే విరుచుకు పడ్డారు. దానితో బెగిలిపోయి జ్వరం తెచ్చుకొన్నాడు. నాబిడ్డ యెటువంటి వాడో విద్య చెప్పే గురువులు మీకు తెలియందికాదు ఓసారి ఆయనతో చెప్పి పెట్టండి బాబూ!" అంది అలివేణి కన్నీళ్ళు తుడుచుకొంటూ,

"సుబ్బులు అలాటివాడు కాదు కానీ...." నసుగుతూ సూర్యనారాయణ ఏదో చెప్పబోయేడు.

అంతలో వీధిలోంచి ఒక కంకరరాయి సూటిగా వచ్చి వెంకటపతి కంటికి తగిలింది. రాయి బాగా సూదిగా ఉందేమో....తగిలిందే తడవుగా రక్తం చిమ్ముకొచ్చింది.

"అయ్యో....అయ్యో" అంటూ కంగారు పడింది అలివేణి.

"ఎవడ్రా అది?" అంటూ వీధిలోకి పరుగుతీసేడు సూర్యనారాయణ.

వీధిలో ఎవరూ లేరు. గుమ్మం ఎక్కుతూ అప్పన్న పంతులు కనిపించేరు.

"ఏమిటి మాష్టారూ .... ఏమయింది." అన్నాడు అతడు.

"వెంకటపతి మాష్టారుకి దెబ్బ తగిలింది."

"అదెలా?"

"ఎవడో వెధవ రాయి విసిరి పారిపోయేడు."

అలివేణి తెచ్చిన నీళ్ళతో దెబ్బని కడిగి, మందురాసి ఇంటిదాకా దిగపెట్టి వచ్చేడు అప్పన్నపంతులు.

దెబ్బ మోపుచేసి వెంకటపతికి కొంచెం జ్వరం వచ్చింది. అయినా పెట్టుకున్న ప్రయాణం మానుకోడం ఇష్టం లేక ఉదయాన్నే బయలుదేరేడు.

రాత్రి సాయంపడుకున్న సహోద్యోగి సుబ్బారావు స్టేషనుకి వచ్చి అతన్ని రైలు ఎక్కించేడు.

రైలు కదిలింది. ఒంట్లో జ్వరంగా ఉండడంవల్ల కొంచెం చలిగా ఉంది. తల మీదుగా దుప్పటిలాక్కొని ఒక మూలగా బెంచీ మీద కూర్చున్నాడు వెంకటపతి. రైలు కదలిన పది నిముషాలకి కాళ్ళకి ఏదో చల్లగా తగిలింది. ముసుగు తొలగించి ఏమిటా అని చూచేడు.

కాళ్ళదగ్గర గంగులు.

"గంగులూ" అన్నాడు ఆశ్చర్యంతో.

"తప్పయిపోయింది. క్షమించండి మాష్టారూ" అన్నాడు ఏడుపుగొంతుతో.

"దేనికి? నువ్వెక్కడికి వెళ్తున్నావు?"

"ఎక్కడికీ వెళ్ళడంలేదని మీతో చెప్పి పోదామనే రైలు ఎక్కాను. మీరంటే నాకెంతో ఇష్టం మాష్టారు! మిమ్మల్ని కొట్టాలని కొట్టలేదు."

తనకి దెబ్బతగిలింది అని వాడు నిజంగా బాధపడ్తున్నట్లు అనిపించింది వెంకటపతికి.

"రాయి విసిరింది నువ్వేనా?"

* * *

"ఎందుకు విసిరేవు?"

"ఆ హెడ్‌మాష్టరు సుబ్బులు సొమ్ము తీసేడని చెప్పబోతూంటే...."

"సుబ్బులు నిజంగా సొమ్ము దొంగిలించాడా?"

"అవును. సుబ్బులు ఆ సొమ్ము నా కోసం తీసేడు. నేను వద్దని చెప్తున్నా వినకుండా, నాతో చెప్పకుండా ఆ పని చేసేడు. అయిదు రూపాయలు యిస్తే గంగుల్ని పాసుచేస్తానని సుబ్బులతో చెప్పి.. మళ్ళా యిప్పుడు ఆ విషయం వాళ్ళమ్మ గారితో చెప్తుంటే....మీకు తెలియదు మాష్టరూ, నిజంగా ఆ సొమ్ము సుబ్బులే తీసేడని వాళ్ళ తాతగారికి తెలిస్తే వాడిని చంపేస్తారు." ఆవేశంతో అన్నాడు గంగులు.

"కాని అలా దొంగతనం చెయ్యడం

తప్పుకదూ?''

గంగులు తిరస్కారంగా ఒక్కసారి వెంకటపతి వైపు చూసేడు. పిల్లలచే దొంగ తనాలు చేయించి తమ జేబులు నింపుకొంటున్న మేష్టర్లేనా ఈ నీతులు చెప్పేది—— అన్నట్లుంది ఆ చూపు. క్షణకాలం కిందట వాడిలో కనిపించిన నమ్రత మాయ మయింది. వాడితో ఇంకా మాట్లాడి ప్రయోజనంలేదని ఊరుకున్నాడు వెంకటపతి.

''ఎక్కడ దిగిపోతావు?'' అన్నాడు యేదో ఒకటి అడగాలన్నట్లు.


''ఇక్కడే'' అన్నాడు గంగులు గుమ్మం వైపు వెళ్తూ.

అక్కడ ఏదీ స్టేషనులేదు. రైలు నడుస్తునే ఉంది. రైలు కట్టకి యిటు అటు కూలీలు పనిచేస్తున్నారు. అందుకే కాస్త మెల్లగా నడుస్తున్నది.

వెంకటపతి యే మాటా అనేలోపునే గంగులు ఒక్క గెంతు గెంతి పక్కనవున్న రాళ్ళ కుప్పమీద బోర్లపడ్డాడు. అలా రైలు లోంచి ఎవరో కుర్రాడు పడిపోవడం చూసి చుట్టుపక్కల కూలీలు పరుగుతో వచ్చేశారు. వారు తనదగ్గరికి వచ్చేలోపునే నేలపడి తిరిగి తుళ్ళిన బంతిలా గంగులు ఒక్క ఉదుటన లేచి పరుగు అందుకున్నాడు. వాడి ముక్కు లోంచి రక్తం కారుతున్నా దాన్ని పట్టించుకోకుండా అదే పరుగుతో దూరంగా వున్న చింత తోపులో మాయమయేడు గంగులు.

అలా పరుగుపెట్టిపోతున్న గంగులు కనిపిస్తున్నంతసేపు తెల్లబోయి చూడ్డం మినహా యేమీ చెయ్యలేక పోయేడు వెంకటపతి. ముందు సాయంకాలం తనకి దెబ్బ తగిలిన దగ్గిరినుంచి గంగులు తన ఇంటి పక్కపక్కల తిరగడం అతడికి గుర్తుకి వచ్చింది. రాత్రంతా సుబ్బారావు తోడుగా ఉండడంవల్ల వాడికి ఈ మాట చెప్పే అవకాశం కలగలేదు. ఆ కాస్తమాట తనతో చెప్పడానికి ఎంత సాహసం తలపెట్టేడు గంగులు?

వాడు అలా ముక్కుంట కారుతున్న




రక్తాన్ని ఎడం చేత్తో తుడుచుకొంటూ, కుడి చేత్తో కళ్ళలో పడ్తున్న జుట్టునితోసుకొంటూ పరుగు పెట్టి పోతూంటే వెంకటపతి కళ్ళు చెమర్చేయి.

''నిజంగా చాకులాంటి కుర్రాడు. సరిగా చూసుకొని బుద్ధులుచెప్పే తలిదండ్రులు వుంటే నిజంగా పెద్దయి నిజాయితీ పరుడైన నాయకుడు అయేవాడు'' అనుకొన్నాడు.

సెలవలు పూర్తి చేసుకొని వెంకటపతి తిరిగి వేళ్ళేసరికి గంగులు ఇల్లు విడిచి వెళ్ళిపోయేడు. ఆనాటి జ్వరం టైఫాయిడ్‌గా మారి మరి పదిరోజుల నాటికి సుబ్బులు ప్రాణాలు తీసింది. వాడిచేత గంగులే దొంగతనం చేయించేడనీ, ఆ కారణంగా జ్వరం తెచ్చుకొన్న సుబ్బులు చచ్చిపోడానికి గంగులే కారకుడనీ ఊళ్లో చిన్నా పెద్దా వాడిని పట్టుకు తిట్టేరు. అత్త తిండి పెట్టకుండా మూడు రోజులు కొట్టుగదిలో కట్టి పడేసిందిట. అందులోంచి గంగులు యెలా తప్పించుకు వెళ్ళిపోయేడో, ఎక్కడికిపోయేడో ఎవ్వరికీ తెలియలేదు.

ఆనాడు వెంకటపతి అనుకొన్నట్లుగా గంగులు నాయకుడు అయేడు. అయితే ప్రజలు, ప్రభుత్వం ఆమోదించే నాయకత్వం కాదు అది. నక్సలైటు నాయకత్వం.


సంగివలస గంగరాజు కేసు వివరాలు రోజు వెనుక రోజుగా ముందు పేజీల్లో ప్రచురించేయి పత్రికలు.

ఎన్నో నేరాలు—— గృహ దహనాలు. హత్యలు దోపిళ్ళు. అత్యాచారాలు——అన్నిటికీ అతడే బాధ్యుడు అన్నారు సాక్షులు; అవునవును అన్నారు న్యాయపీఠం మీద ఉన్న పెద్దలు.

న్యాయానికి చెవులేకాని కళ్ళు ఉండవుట వుంటే, చూడ గలిగి వుండేది. గంగరాజు లాంటి వయసులో వున్న యువకుడు నక్సలైటు కావడానికి కారణం ఏమిటి?—అని? సంఘవిద్రోహిగా మారడానికి కారకులెవరూ——అని?

గంగరాజు అలా తయారు కావడానికి కారకులైన అత్త మామల్ని, ఆఊరిపెద్దల్ని, మంచి మర్యాదలకి బదులుగా అవినీతి నేర్పే గురువుల్ని పట్టి, విచారించి, శిక్షవేసే ఓపిక దానికిలేదు. తన చిన్న పరిధిని దాటి పైకి చూసేశక్తి దానికిలేదు. అందుకే నిర్ణయించింది—— ఎందరో చేసిన నేరాలకి ఎదుట నిలబెట్టిన ఒకే ఒక వ్యక్తిని దోషిగా.

గంగరాజుని నిందితుడుగా నిలపడానికి




పోలీసులు రోజుల తరబడిగా అల్లుతున్న శిక్షమాలలో కొలికిపూస పడిపోయింది. ఆరోజే గంగరాజుని ఉరితీసేరోజు, ఆ శిక్షా మాల నిందితుడి కంఠం అలంకరించే రోజు.

రోజూలా ఆ ఉదయం వార్తలు వినాలని పించలేదు వెంకటపతికి. "రోజూ నిద్ర మంచంమీంచి లేస్తునే రేడియోపెట్టుకు కూర్చుటారుకదా. సరిగ్గా ఈ రోజు మానే సేరేం!" భార్యారత్నం బరువుగా అడుగులు వేస్తూ గదిలోకి వచ్చింది.

గంగరాజుని ఉరితీసేరు—అన్న వార్తని చెవులారా వినాలని ఆవిడ ఉబలాటం. పతి దేవుడు ఉలుకు, పలుకు లేక అలా కళ్ళు మూసుకు పడుకోడం చూసి, భారతనారి కాబట్టి అతడి నిద్రాభంగం అవుతుందని రేడియో పెట్టకుండా నోటిలో ఏదో గొణుక్కుంటూ వెళ్లిపోయింది.

"నాన్నా.... నాన్నా ఈపూట వార్తలు విన్నారా!" తన పెళ్లికి అత్తవారు బహూకరించిన ట్రాన్సిస్టర్‌తో అప్పటికే ఆవార్త విన్నకొడుకు తట్టిలేపి అడుగు తున్నాడు.

ఆ వార్త వినాలని లేదు. ఆక్షణంలో యదార్థాన్ని యెదుర్కొని, హరాయించుకొనే శక్తి అతడిలో లేదు. అయినావినక తప్పదు మళ్ళా మళ్ళా తట్టి పిలుస్తున్నాడు కొడుకు. ఆ వార్త తండ్రి చెవిలో వేస్తేకాని అతడికి తృప్తి కలగదులా వుంది.

కళ్ల మెల్లగా విప్పేడు వెంకటపతి.

వీధిలో కనుచీకటి పడ్తున్నాది. నడిసావిట్లో వేసిన లైటు వెలుగు మెట్లమీద పడ్తున్నాది. కలేమో అన్నట్లు కళ్ళునులుపుకు చూసేడు.

"ఈ పూట వార్తలు విన్నారా!" తిరిగి అదే ప్రశ్న వేసేడు కొడుకు.

"లేదురా."

"సంగివలస గంగరాజుని పోలీసులు ఎరష్టు చేసి తీసుకుపోతుంటే—నడుస్తున్న రైలులోంచి దూకి, తప్పించుకొని పారిపోయేట్ట."

గుండెలమీంచి ఎంతో బరువు దింపుకొన్నట్లు అయింది వెంకటపతికి. గట్టిగా ఒక నిట్టూర్పు విడిచేడు.

"చీకట్లో కూర్చున్నారేమిటి?" అప్పుడే పురాణంనుంచి తిరిగివచ్చిన సత్యనారాయణమ్మ వరండాలో లైటువేసింది.

చేతిలోవున్న పేపర్లో గంగరాజు—చారల లాల్చీ. పొట్టి నిక్కరు, కళ్లలో పడ్తున్న జుట్టుని ఎగదోసుకొంటూ రైలు దూకి పారిపోతున్న గంగుల్లా కనిపించేడు వెంకటపతికి.

ఎదురుగా వీధిలో కనుచీకటి పడుతున్నా ఇంకా కొందరు పిల్లలు ఆడుకొంటున్నారు. వాళ్ళు నక్సలైట్లు కారు; ప్రజానాయకులు అంతకన్నా కారు. కేవలం పసిపిల్లలు. పెద్దల చేతుల్లో రూపురేఖలు దిద్దుకొంటున్న పచ్చి మట్టిలాంటి పసివాళ్ళు. వాళ్ళు పెరిగి పెద్దవారై, దేశసౌభాగ్యాన్ని పెంపొందించే ప్రజానాయకులు అవుతారా? తమని తాము నాశనం చేసుకొంటూ దేశాన్ని పక్కదారులు పట్టించే నక్సలైట్లు అవుతారా?

అదంతా వారి పెంపకంపై ఉంటుంది. పెంచి పెద్దచేసే పెద్దలపై ఉంటుంది. విద్యాబుద్ధులు నేర్పే అధ్యాపకులపై ఉంటుంది. వారు అందుకొన్న జీవితంమీద, పెంచుకొన్న విలువలమీద వుంటుంది.

మంచీ, చెడ్డా ఏ ఉద్యమం అయినా తనకు తానుగా ఒక్కరాత్రిలో పుట్టుకురాదు. దాని పుట్టుకకి ఎన్నో అనుకూల, ప్రతికూల శక్తులు దోహదం చేస్తాయి. నక్సలైటు ఉద్యమంకూడా అటువంటిదే. దాన్ని అణచాలంటే ఏ ఒకరో, ఇద్దరో నాయకుల్ని పట్టుకొని శిక్షిస్తే చాలదు. ఈరోజు గంగరాజును ఉరితీస్తే రేపు మరో సింగరాజు ఆ స్థానాన్ని ఆక్రమిస్తాడు. ఆదివ్యక్తిని శిక్షించినట్లు అవుతుంది కాని ఉద్యమాన్ని కాదు. ఉద్యమాన్ని నిర్మూలించాలంటే దాని మూలకారణాన్ని పట్టుకోవాలి. తిరిగి తలెత్తకుండా ఉరితియ్యాలి. అంతవరకు ఎంతమందిని దోషులుగా నిలిపి శిక్షించినా అంతే—ఉద్యమం దారి ఉద్యమందే—ఉరిశిక్షల దారి ఉరిశిక్షలదే.

మనిషిలో విద్రోహబుద్ధి ఒక ముళ్ళ దొంకలాటిది. ఒకసారి విత్తుపడి మొలకెత్తింది అంటే ఒకంతట చావదు. పైపై కొమ్మలు కొట్టివేస్తుంటే, మరిన్ని చిగుళ్ళు పెట్టి శాఖలు, పిలకలుగా ఇంకా విస్తరించిపోతుంది. దానిని నాశనం చెయ్యాలంటే మూలాన్ని పట్టుకొని వేళ్ళతోసహా పెకలించి పారేయాలి—అప్పుడే దానినుంచి విముక్తి.

వెంకటపతి ఆలోచిస్తున్నాడు. భార్య ఒకటికి రెండుసార్లు భోజనానికి పిలిచి విసుక్కొనేదాకా అలా ఆలోచిస్తూనే ఉన్నాడు. గంగులు నక్సలైటుగా మారడానికి కారణం ఏమిటా—అని.